

## ఎంఐఎంకు భారీ షాక్

- అక్బరుద్దీన్ ఇలాకా నుంచి టీఆర్పీలో చేరికలు
- కీలక నేత అమీర్ ఖాన్ సహా 80 మంది అనుచరుల జాయినింగ్
- సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
- మైనార్టీ యూత్ ప్రెసిడెంట్‌గా అమీర్ ఖాన్ నియామకం

2


# శనార్తి తెలంగాణ

telanganarajyadhikaraparty.in

సంపుటి : 06 | సంచిక : 15 (కాంప్లిమెంటరీ కాపీ) | ఎడిటర్ : తీన్మార్ మల్లన్న | సోమవారం 14-09-2026 | పేజీలు : 3




# బెల్టుకు బ్రేకుల్లేవ్

## వీధికో మద్యం దుకాణం

**అనుమతి ఉన్న మద్యం షాపులు 2,620**

**కానీ, అనధికార బెల్ట్ షాపులు అనేకం**

**ఒక్కో వైన్ షాపుకు అనుబంధంగా 100 వరకు బెల్ట్ షాపులు**

**గ్రామాల్లో విచ్చలవిడిగా లిక్కర్ సేల్**

**90, క్వార్టర్‌కు భారీగా డిమాండ్**

బెల్ట్ షాపుల నుంచి పోలీసు, ఆబ్కారీ అధికారులకు మామూళ్లు

గ్రామాల్లో మద్యం అమ్మకాలపై పలుచోట్ల జీపీల తీర్మానాలు

అయినా గ్రామాల్లో తగ్గని లిక్కర్ జోరు

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్:**

తెలంగాణలో బెల్ట్ షాపులకు బ్రేకులు లేకుండాపోతోంది. యథేచ్ఛగా వీధికో మద్యం దుకాణం నడుస్తోంది. పోలీసుల దన్ను, ఆబ్కారీ శాఖ అండ, వైన్స్ షాపుల మద్దతుతో గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు రన్ అవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గత టర్మ్ తెలంగాణ వ్యాప్తంగా 2,620 మద్యం షాపులకు అనుమతులు ఇచ్చింది. అసలు నిబంధనల ప్రకారమైతే ఇక్కడే మద్యం విక్రయాలు జరగాలి. వినియోగదారులు ఎవరున్నా ఇక్కడే లిక్కర్‌ను కొనుకోవాల్సి ఉంటుంది. బల్క్‌లో లిక్కర్‌ను తీసుకుపోవడానికి అస్సలు వీల్లేదు. కానీ, రాష్ట్రంలో 2,620 మద్యం దుకాణాలుంటే.. వాటికి అనుబంధంగా భారీగా బెల్ట్ షాపులు నడుస్తుండడం గమనార్హం. తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లోనైతే ప్రతీ ఏ4 రిటైల్ వైన్ దుకాణానికి అనుబంధంగా 30 నుంచి 100 వరకు బెల్ట్ దుకాణాలు నడుస్తున్నట్లు సమాచారం. 2025-26లో మద్యం అమ్మకాల ద్వారా రూ.44,557 కోట్ల ఆదాయం వచ్చినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇక ఈ ఆర్థిక సంవత్సరంలో లిక్కర్ ద్వారా అందే ఆదాయం భారీగానే సమకూరుతోందని ప్రభుత్వం భావిస్తోంది.

అయితే ఈ స్థాయిలో రాష్ట్ర సర్కార్‌కు ఆదాయం రావడం వెనుక బెల్ట్ షాపుల పాత్రే కీలకం కావడం విశేషం. ప్రస్తుతం పట్టణ ప్రాంతాలను మినహాయిస్తే గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ దుకాణాలు మండలానికి ఒకటి నుంచి మూడు వరకు మాత్రమే ఉన్నాయి. అయితే వీటి ద్వారే లిక్కర్ అమ్మితే వైన్ షాపులకు అస్సలు గిట్టుబాటు కాదనే అభిప్రాయాలున్నాయి. ఈ నేపథ్యంలోనే క్షేత్రస్థాయిలో వైన్ షాపుల యాజమానులే గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ షాపులను విచ్చలవిడిగా ప్రోత్సహిస్తున్నారనే విమర్శలున్నాయి. వైన్ షాపుల నుంచి ప్రతీ నెల స్థానిక పోలీసులు, ఆబ్కారీ అధికారులకు యాజమానులు మామూళ్లు పంపుతున్నట్లు సమాచారం. షాపు పొటెన్షియల్‌ను బట్టి స్టేషన్, అధికారి తీరుకు అనుగుణంగా రూ.25 వేల నుంచి లక్ష వరకు అమ్యామ్యాలు ముడుతున్నట్లు తెలుస్తోంది.


**తరువాయి 2లో...**




## ముక్క పెట్టాల్సింది

- బ్రిక్స్ సదస్సులో నాన్‌వెజ్ పెట్టరా..?
- శాఖాహారంతోనే సరిపుచ్చడమేంటి ?
- దేశంలో 80 శాతం మాంసాహారులే
- మరి నాన్‌వెజ్ ఎందుకు పెట్టలే..!
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- రాహుల్ కామెంట్స్‌పై కిరణ్ రిజిజు ఖండన
- శాఖాహారాన్నే అన్ని దేశాధినేతలు ఆస్వాదించారని చురకలు

2



## తెలంగాణకు రెయిన్ అలెర్ట్

- రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు
- 30 నుంచి 40 కిమీ వేగంతో ఈదురుగాలు
- హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరిక
- ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ
- అప్రమత్తమైన అధికారులు

2



## నిరుద్యోగులకు ఎస్ఎస్‌సీ తీపి కబురు

- 1,748 జేఈ పోస్టుల భర్తీకి నోటిపికేషన్
- ఈనెల 22 వరకు దరఖాస్తులకు ఛాన్స్
- ఇతర విభాగాల్లోని 2,536 ఉద్యోగాలకు నోటిఫికేషన్
- అక్టోబర్ 7 వరకు అప్లైకి ఛాన్స్

2

# సర్కారు వైద్యం.. సర్వత్రా శోకం..

**ప్రజల ఆరోగ్యంతో చెలగాటం**

**మందుల్లేని దవాఖానలు..**

**వైద్యుల్లేని వార్డులు**

**వెంటాడుతున్న స్టాఫ్ నర్సుల కొరత**

**ఉచితం మాటలకే పరిమితం**

**సకాలంలో అందని మెరుగైన వైద్యం**

**ఉస్మానియా నుంచి మొదలు జిల్లా ఆస్పత్రుల దాకా ఇదే తీరు**

**పనిచేయని స్కానింగ్, ఎక్స్-రే యంత్రాలు**

**గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి**

**అరకొర వసతులు.. రోగుల తంటాలు**

**తప్పని పరిస్థిలో ప్రైవేట్ వైపు చూపు**

**ఇదే అదునుగా నిలువు దోపిడి**

**అడ్డగోలు టెస్టులు.. లక్షల్లో బిల్లులు..**

**సరైన వైద్యం అందక పేదల అవస్థలు**



**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :**

ప్రభుత్వం ఏదైనా.. పేద, మధ్యతరగతి ప్రజలకు సర్కారు వైద్యం అందని ద్రాక్షలాగే మారింది. ఎన్నికల సమయంలో నోటికొచ్చిన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక అటు వైపు కన్నెతుకూడ చూడని నేతలు మన తెలంగాణలో ఉన్నారంటే నమ్ముతారా..? పేదలకు ఉచితంగా, మెరుగైన వైద్యం అందిస్తామన్న ప్రభుత్వాల హామీలు పడావు పడ్డాయి. హైదరాబాద్ నగరంలోని చారిత్రాత్మక ఉస్మానియా జనరల్ హాస్పిటల్ నుంచి మొదలుకొని జిల్లా దవాఖానలు, పల్లెలోని పీహెచ్సీల వరకు ప్రభుత్వ వైద్య వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. కష్టకాలంలో ఉన్న పేద ప్రజలకు సరైన సమయంలో వైద్యం అందక, సకాలంలో చికిత్స దొరక్క నరకయాతన అనుభవిస్తున్నారు. ఏ దేవుడైనా వస్తే బాగుండు.. మమ్మల్ని ఆదుకుంటే బాగుండు అని వెయ్యి కండ్లతో ఎదురు చూస్తున్నారు.

**తరువాయి 2లో...**

# భారత్ దౌత్యం భళా

**బ్రిక్స్ సదస్సు సక్సెస్ | విభిన్న అభిప్రాయాలు..**

**కానీ, ఒకే వేదికపై ఏకాభిప్రాయం**

**సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయం తేవడంలో ఇండియా విజయం**

**భారత విదేశాంగ విధానానికి ప్రపంచ దేశాల ప్రశంసలు**



**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:**

భారత విదేశాంగ విధానం సూపర్. ఈ విషయం బ్రిక్స్ 18వ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా మరోసారి నిరూపితమైంది. భారత్ దౌత్యపరంగా ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించడం ద్వారా తన సత్తా ఏంటో ప్రపంచానికి చాటి చెప్పింది. బ్రిక్స్ కూటమి తొలుత ఐదు సభ్య దేశాలతో ఏర్పడిన విషయం తెలిసిందే. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా కూటమిలో మొదటి భాగస్వాములు. అయితే 2023 జోహన్నెస్‌బర్గ్ సదస్సులో బ్రిక్స్ విస్తరణపై కీలక నిర్ణయం జరిగింది. కూటమిని విస్తరించాలని నిర్ణయించారు. అందులో భాగంగానే మరో ఆరు దేశాలు బ్రిక్స్ కూటమిలోకి వచ్చాయి. ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ,

**తరువాయి 2లో...**

# సీటు కోసం సిగపట్లు

- ఫ్రీ బస్సులో మహిళల ఘర్షణ
- పరిగి-హైదరాబాద్ బస్సులో ఘటన
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- బస్సు ఎక్కాలంటే జంకుతున్న పురుషులు
- రోజూ జాతరను తలపిస్తున్న ప్రయాణం
- ఫ్రీ బస్సు అమలుపై తీవ్ర విమర్శలు
- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహం

2



# కాంగ్రెస్‌లోనే ఉంటాం

## మా యుద్ధం మాత్రం ఆగదు

- మంత్రి పదవి పోవడం బాధగా లేదు
- పార్టీలో కొన్ని గుంట నక్కలు ఉన్నయ్
- నిన్న మొన్న వచ్చినోళ్లు మాపై మాట్లాడుతున్నరు
- రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచే పోటీ
- కార్పొరేషన్ ఎన్నికల్లోనూ మా అనుచరులకే టికెట్లిస్తాం
- కొండా దంపతుల కీలక వ్యాఖ్యలు



**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :**

తెలంగాణ రాజకీయం వేడెక్కింది. మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయిన కొన్ని రోజుల తర్వాత సైలెంట్ మోడ్ వీడిన మాజీ మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి తీవ్ర వ్యాఖ్యల చేశారు. ఆదివారం వరంగల్‌లో తమ అభిమానులు, కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశం కొండా దంపతులు మాట్లాడుతూ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..

**తరువాయి 2లో...**



# సీటు కోసం సిగపట్లు

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** తెలంగాణలో మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. అయితే, పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో అసలు సమస్య మొదలైంది. ఈ ఉచిత బస్సు ప్రయాణం మహిళల మధ్య యుద్ధాన్నే సృష్టిస్తోంది. ఇప్పటి వరకు ఎన్నో ఘర్షణలు చోటు చేసుకున్నా.. తాజాగా జరిగిన ఓ ఘటన చర్చనీయాంశమైంది. ఆదివారం పరిగి నుంచి హైదరాబాద్ వెళుతున్న టీజీ ఎస్ఆర్టీసీ బస్సులో సీట్ల కోసం కొందరు మహిళలు తీవ్రంగా కొట్టుకున్నారు. ఒకరి జుట్టు మరొకరు పట్టుకుని, పిడిగుద్దులతో విరుచుకుపడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, ఉచిత ప్రయాణ పథకం వల్ల బస్సుల్లో పెరిగిన రద్దీ, తలెత్తుతున్న వివాదాలపై మళ్లీ చర్చ మొదలైంది. వికారాబాద్ జిల్లా పరిగి నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న బస్సులో ఈ గొడవ జరిగింది. వినాయక చవితి పండుగ నేపథ్యంలో బస్సు ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో సీటు విషయంలో నలుగురు మహిళల మధ్య వాగ్వాదం మొదలై, అది తీవ్ర ఘర్షణకు దారితీసింది. తోటి ప్రయాణికులు వారిని విడదీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ గొడవతో ఇబ్బందిపడిన కొందరు ప్రయాణికులు బస్సు దిగి వెళ్లిపోయారు. ఉచిత బస్సు ప్రయాణంతో పురుషులు బస్సు ఎక్కాలంటేనే జంకుతున్నారు. ఫ్రీ జర్నీ పోరువ్వడలేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. మొత్తంగా ఉచిత బస్సు పథకంపై పురుషులతో పాటు, కొందరు మహిళలు కూడా విమర్శలు గుప్పిస్తున్నారు.

# తెలంగాణకు రెయిన్ అలెర్ట్

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రెండ్రోజులు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు ఆదివారం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వాతావరణ శాఖ అంచనా ప్రకారం.. హైదరాబాద్ తో పాటు ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో వర్షాలు పడతాయని తెలిపింది. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తారు వర్షపాతం నమోదైంది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనలో అత్యధికంగా 9.35 సెం.మీ., ఖమ్మం జిల్లా కారేపల్లిలో 6.5 సెం.మీ. వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లా కన్నెపల్లిలో ఏకంగా 13.55 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు తెలంగాణ అభివృద్ధి ప్రణాళిక సంస్థ (టీజీడీపీఎస్) గణాంకాలు వెల్లడించాయి. హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో వర్షం కురవాగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి, కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. ఈ వర్షాల కారణంగా ఉత్తర తెలంగాణలోని ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఆసిఫాబాద్ జిల్లాలోని వట్టివాగు, కుమరం భీం ప్రాజెక్టుల్లోకి 2,172 క్యూసెక్కుల వరద వస్తుండగా, అధికారులు 1,378 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో రైతులు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.




# బెల్టుకు బ్రేకుల్లేవ్

**మొదటిపేజీ తరువాయి...**

అటు ఎక్సైజ్ అధికారులకు సైతం అదే స్థాయిలో రొక్కం అందుతున్నట్లు సమాచారం. వైన్ షాపుల కింద బెల్ట్ షాపులు నడిచే సంఖ్యను బట్టి అధికార యంత్రాంగానికి కమిషన్లు ఇస్తుండడం గమనార్హం. అంతేకాక వైన్ షాపులు ఇచ్చే మామూళ్లే కాక అప్పుడప్పుడు బెల్ట్ షాపుల వద్ద బీట్ కానిస్టేబుల్స్ కూడా అందిన కాడికి వసూళ్లు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అయితే క్షేత్రస్థాయిలో ఈ స్థాయిలో ముడుపులు ముడుతుండడంతోనే గ్రామీణ ప్రాంతాల్లో మద్యం ఏరులైపారుతున్నట్లు తెలుస్తోంది.

వైన్స్ వద్ద సిట్టింగ్‌కు అవకాశం ఉంటుంది. అయితే ప్రస్తుతం మెజార్టీ వైన్స్‌లు మండల కేంద్రాలు లేదా మేజర్ గ్రామ పంచాయతీల్లోనే ఉన్నాయి. అక్కడికి వెళ్లడం ఇతర గ్రామాల ప్రజలకు ఇబ్బందే. అయితే ఇదే అదనుగా చూసుకొని బెల్ట్ షాపుల నిర్వాహకులు పెద్ద ఎత్తున ఒకేసారి టోకు రూపంలో మద్యాన్ని వైన్ షాపుల నుంచి తీసుకెళ్లి గ్రామాల్లో విక్రయిస్తున్నారు. గ్రామాల్లో ప్రతీరోజు
వ్యవసాయ, కూలీ పనులు చేసుకుని కలిగిన కాడికి కల్లు గంజో తాగి జీవనం కొనసాగించే ప్రజలే ఎక్కువ మంది ఉంటారు. అయితే బెల్ట్ షాపులు నడిపిస్తున్న వారు... వారి వద్ద ఖాతాలు ఓపెన్ చేసి ఉద్దెర కూడా ఇస్తుండడంతో గ్రౌండ్ లెవెల్‌లో మద్యం విక్రయాలు భారీగా పెరగడం గమనార్హం. తాము సంపాదించిన దాంట్లో ఎక్కువ మొత్తం ప్రజలు కూడా ఈ బెల్ట్ దుకాణాల్లో తగిలేస్తున్నారు. 90, క్వార్టర్ల పేరుతో వచ్చి ఆదాయాన్ని బెల్ట్ దుకాణాల్లోని లిక్కర్ కోసమే ఖర్చు చేస్తున్నారు. అయితే రాష్ట్రంలోని పలుచోట్ల ఈ బెల్ట్ షాపుల నిర్వహణ పట్ల ప్రజల నుంచి నిరసనలు రావడం గమనార్హం. వివిధ ప్రాంతాల్లో ఆయా గ్రామ పంచాయతీలు బెల్ట్ షాపుల నిర్వహణకు వ్యతిరేకంగా తీర్మానాలు కూడా చేయడం విశేషం. అయితే క్షేత్రస్థాయిలో పబ్లిక్ నుంచి ఎంతలా కట్టడి చేసే ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ పోలీసు, ఆబ్కారీ శాఖల అండదండలతో బెల్ట్ షాపుల లిక్కర్ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతుండడం విశేషం.

# ఇండోనేషియాలో ఘోర ప్రమాదం

- ప్యాసింజర్ నౌక మునక
- ఏకంగా 130 మంది గల్లంతు
- ఆరుగురి మృతదేహాలు లభ్యం
- 107 మందిని కాపాడిన సహాయక బృందాలు
- జావా సమీపంలో ఘటన
- భారీ అలల వల్లే నౌక బోల్తా




**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** ఇండోనేషియాలో ఘోర ప్రమాదం జరిగింది. జావా సమీపంలో సముద్రంలో ఆదివారం విర్గో ట్రాన్స్‌పోర్ట్ 8 అనే ప్యాసింజర్ నౌక నీట మునిగింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా.. 130 మంది గల్లంతయ్యారు. మరో 107 మందిని సహాయక బృందాలు రక్షించాయి. సురబయా నుంచి దక్షిణ కలిమంతాన్‌లోని బంజర్‌మసిన్ వైపు వెళ్తున్న ఈ నౌకలో మొత్తం 243 మంది ఉన్నారు. వీరిలో 213 మంది ప్రయాణికులు, 30 మంది సిబ్బంది ఉన్నారు. ప్రమాదానికి ముందు సముద్రంలో భారీ అలలు ఎగసిపడటంతో నౌక ప్రమాదకర పరిస్థితుల్లో చిక్కుకుంది. నౌక కెప్టెన్ సముద్రం అల్లకల్లోలంగా ఉందని, నౌక ఒకవైపునకు ఒరిగిపోతోందని సమాచారం ఇచ్చిన కొద్దిసేపటికే ప్రమాదం జరగడం గమనార్హం. మరోవైపు ప్రమాద సమాచారం అందిన వెంటనే ఇండోనేషియా నేషనల్ రీసెర్చ్ అండ్ డిఫెన్స్ సంస్థ రంగంలోకి దిగింది. సహాయక చర్యలు చేపట్టింది. విర్గో ట్రాన్స్‌పోర్ట్ 8 చివరిసారిగా మునిగిపోయిన ప్రాంతంలో నేవీకి చెందిన నాలుగు నౌకలు సహా సుమారు 12 నౌకలు, రెండు హెలికాప్టర్లతో గాలింపు చేపట్టారు. నౌకలో 89 వాహనాలు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. నౌక మునిగిపోయే సమయంలో సముద్రంలో మూడు మీటర్ల ఎత్తు వరకు అలల తీవ్రత ఉన్నట్లు ఇండోనేషియా అధికారిక యంత్రాంగం గుర్తించింది. ప్రమాదానికి ప్రతికూల వాతావరణం, భారీ అలలే కారణమని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే నౌక బోల్తాకు సంబంధించి ఇంకా కచ్చితమైన కారణం ఏంటనే ఫైనల్ నిర్ణయానికి మాత్రం రాలేదని వెల్లడించారు. ఇక ఇండోనేషియా పడవ ప్రమాదంపై పలువురు దేశాధినేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.




# నిరుద్యోగులకు ఎస్ఎస్‌సీ తీపి కబురు

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** నిరుద్యోగులకు స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) తీపి కబురు అందించింది. కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి వరుస నోటిఫికేషన్లు విడుదల చేస్తోంది. ఆదివారం జూనియర్ ఇంజినీర్ (జేఈ) పోస్టుల భర్తీకి 1,748 ఖాళీలతో నోటిఫికేషన్ జారీ చేసింది. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, టెలికాం తదితర విభాగాల్లో ఈ పోస్టులను భర్తీ చేయనుంది. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మరోవైపు 12వ తరగతి అర్హతతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లోకి ప్రవేశించే కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ (సీహెచ్ఎస్ఎల్) పరీక్షకు కూడా ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎల్‌డీసీ, జేఎస్ఏ, డేటా ఎంట్రీ ఆపరేటర్ తదితర పోస్టులకు కలిపి 2,536 ఖాళీలను భర్తీ చేయనుంది. ఈ ఉద్యోగాలకు అక్టోబర్ 7 వరకు దరఖాస్తు చేసుకునేందుకు స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ అవకాశం కల్పించింది. జేఈ పోస్టులకు దరఖాస్తు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో అర్హత ఉన్న అభ్యర్థులు చివరి తేదీ కోసం వేచి ఉండకుండా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ సూచించింది.

# నాగాలాండ్‌లో దారుణం

- కల్తీ మద్యం సేవించి 9 మంది మృతి
- రాష్ట్ర వ్యాప్తంగా హై అలర్ట్
- ప్రజలు లిక్కర్ జోలికెళ్లొద్దు
- డీజీపీ రూపిన్ శర్మ



**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** నాగాలాండ్‌లో దారుణం చోటుచేసుకుంది. ఆ రాష్ట్రంలో కల్తీ మద్యం కలకలం రేపుతోంది. తుయెన్‌సాంగ్ జిల్లాలో మూడు రోజుల వ్యవధిలోనే తొమ్మిది మంది మృతి చెందారు. వీరంతా తుయెన్‌సాంగ్ సివిల్ ఆసుపత్రిలో ఒకే తరహా లక్షణాలతో మృతి చెందినట్లు నాగాలాండ్ డీజీపీ రూపిన్ శర్మ తెలిపారు. మద్యం సేవించిన తర్వాత అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరిన వారిలోనే పలువురు మరణించినట్లు వెల్లడించారు. కల్తీ మద్యం కారణంగానే ఈ మరణాలు సంభవించి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై నాగాలాండ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కల్తీ మద్యం సరఫరా మూలాలను గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. పలు మద్యం బ్యాచ్‌లను పోలీసులు స్వాధీనం చేసుకోగా, వాటిపై ఉన్న లేబుళ్లు అసలు బ్రాండ్‌లతో సరిపోలడం లేదని డీజీపీ వెల్లడించారు. ఎంసీ రమ్‌కు సంబంధించిన ఓ బ్యాచ్ తేడాగా అనిపించడంతో దాన్ని సీజ్ చేయించినట్లు తెలిపారు. అయితే ఈ తరహా బ్యాచ్ మద్యం బాటిల్స్ ఎక్కడ తయారయ్యాయి.. ఎక్కడి నుంచి వస్తున్నాయనే అంశాలపైనా ప్రస్తుతం ఆ రాష్ట్ర పోలీసులు ఆరా తీస్తున్నారు. మరోవైపు కల్తీ మద్యం కారణంగా మరణాల సంఖ్య క్రమంగా పెరుగుతుండడం వల్ల నాగాలాండ్ పోలీస్ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఇప్పుడున్న పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు మద్యం సేవించవద్దని హెచ్చరించారు. ముఖ్యంగా మోన్, మొకోక్‌చుంగ్, తుయెన్‌సాంగ్, లాంగ్‌లెంగ్, కిఫైర్, షమాటోర్, నోక్లాక్ జిల్లాల ప్రజలు లిక్కర్‌కు దూరంగా ఉండాలని సూచించారు. పరిస్థితులు పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు రాష్ట్రంలోని ఇతర జిల్లాల ప్రజలు కూడా మద్యం సేవించకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు. నాగాలాండ్ పూర్తి మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తోంది. ఆ రాష్ట్రంలో మద్యం తయారీ, అమ్మకం, కొనుగోలు, రవాణా, దిగుమతి, వినియోగాన్ని పూర్తిగా బ్యాన్ చేశారు. అయితే మద్యంపై నిషేధం కొనసాగుతున్నప్పటికీ అసలు కల్తీ మద్యం ఎవరు తయారు చేశారు..? ఎక్కడి నుంచి సరఫరా అయ్యిందనే అంశాలపైనే ప్రస్తుతం తుయెన్‌సాంగ్ జిల్లా పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# సర్కారు వైద్యం.. సర్వత్రా శోకం..

**మొదటిపేజీ తరువాయి...**

దీనికి ప్రధాన కారణం.. ఆసుపత్రుల్లో రోగుల సంఖ్యకు తగ్గట్టుగా వైద్యులు, స్టాఫ్ నర్సులు అందుబాటులో ఉండటం లేదు. ప్రధాన వార్డులు సైతం సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అత్యవసర సమయాల్లో పర్యవేక్షించే వారు లేక రోగులు కనుమూస్తున్న పరిస్థితులు కోకొల్లలు... సర్కారు ఆసుపత్రికి వెళ్తే ఉచితంగా మందులు లభిస్తాయన్న నమ్మకం ఆవిరైపోతోంది. అత్యవసర ఔషధాల నుంచి సాధారణ మాత్రల వరకు బయటి మెడికల్ షాపుల్లో కొనుక్కోవాల్సి పరిస్థితి దాపురించింది. ఎక్స్-రే, సీటీ స్కాన్, ఎమ్మారై యంత్రాలు పనిచేయక మూలనపడ్డాయి. వైద్య పరీక్షల కోసం తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో నిలబడి గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. అయినా, ఫలితం శూన్యం... "మీరు ప్రైవేట్ లో స్కానింగ్ చేయించుకోండి" అని బయటికి పంపుతున్నారు..! దీనికి తోడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో బెడ్లు చాలక ఒకే మంచంపై ఇద్దరిని పడుకోబెట్టడం లేదా నేలపైనే పడకలు వేయడం ఆసుపత్రుల దయనీయ స్థితికి అద్దం పడుతోంది. తాగునీరు, పరిశుభ్రత లేక రోగులకు తోడుగా వచ్చిన సహాయకులు కూడా రోగాల బారిన పడుతున్నారు. సకాలంలో అందని చికిత్సతో విసిగిపోయిన ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. దీన్నే అదునుగా చేసుకుంటున్న కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు నిలువు దోపిడీకి పాల్పడుతున్నాయి. అవసరం లేకున్నా అడ్డగోలుగా స్కానింగ్‌లు, రక్త పరీక్షలు చేయిస్తూ లక్షల్లో బిల్లులు గుంజుతున్నారు. కొందరు వైద్యాన్ని వ్యాపారంగా మార్చేయడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు అప్పుల పాలై వీధిపాలువుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో తక్షణమే ఖాళీలను భర్తీ చేసి, వైద్య పరికరాలను అందుబాటులోకి తెచ్చి, పేదలకు ఉచిత వైద్యం సరిగ్గా అందేలా చర్యలు తీసుకోకపోతే 'సర్కారు వైద్యం'పై ప్రజలకు పూర్తిగా నమ్మకం పోయే ప్రమాదం ఉందని, విపక్షాలు తీవ్రంగా హెచ్చరిస్తున్నాయి. మధ్యతరగతి ప్రజలు సైతం ప్రభుత్వా దవాఖానపై దృష్టి పెట్టాలని, పేద ప్రజల గోడు వినాలని వేసుకుంటున్నారు.







# ఎంఐఎంకు భారీ షాక్

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** భాగ్యనగరంలో ఎంఐఎం పార్టీకి భారీ ఎదురు దెబ్బ తగిలింది. చంద్రాయణగుట్ట నియోజకవర్గ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ అనుచరుడిగా గుర్తింపు పొందిన అమీర్ ఖాన్ తన 80 మంది అనుచరులతో కలిసి ఆదివారం తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. టీఆర్పీ స్టేట్ మైనార్టీ ప్రెసిడెంట్ సల్మాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అమీర్ ఖాన్‌తో పాటు ఆయన అనుచరులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అమీర్ ఖాన్‌ను తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఉమ్మడి హైదరాబాద్ జిల్లా మైనార్టీ యూత్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ తీన్మార్ మల్లన్న నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ మైనార్టీ యువతను టీఆర్పీ సిద్ధాంతాల వైపు తీసుకువెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో మైనార్టీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో సమాన వాటా కల్పించడమే తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మైనార్టీల అభివృద్ధి, సాధికారత కోసం టీఆర్పీ నిరంతరం పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మైనార్టీల ఆశయాలను నెరవేర్చడంలో ఎంఐఎం పార్టీ విఫలమైందని, అందువల్లే యువత ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా టీఆర్పీ వైపు ఆకర్షితులవుతున్నారని మల్లన్న అన్నారు. రానున్న రోజుల్లో మైనార్టీ వర్గాల నుండి మరింత మంది యువత, నాయకులు తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరనున్నారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గంగాధర్ లింగాల, పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బందారపు నర్సయ్య గౌడ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క, కార్మిక విభాగం అధ్యక్షుడు సంకూరి శ్రీనివాస్, యువజన విభాగం అధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి కొమ్మల ప్రవీణ్ రాజ్, యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చింటూ, ప్రధాన కార్యదర్శి వీరమల్లు అనిల్, సహాయ కార్యదర్శి గిరిగాను బిక్షపతి గౌడ్, స్టేట్ ఆఫీస్ కోఆర్డినేటర్ లింగం యాదవ్, మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షుడు మున్నూరు జయపాల్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఎండి గౌస్ పాషా, మైనారిటీ విభాగ నాయకులు, కార్యకర్తలు, అమీర్ ఖాన్ అనుచరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లోనే ఉంటాం

**మొదటిపేజీ తరువాయి...**

కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని, రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. అంతేకాకుండా, వచ్చే ఎన్నికల్లో మళ్లీ వరంగల్ ఈస్ట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచి తీరుతానని, మళ్లీ మంత్రిని కూడా అవుతానని సురేఖ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. మంత్రి పదవి పోయిందనే బాధ నాకు లేదు. నేను నిర్వహించిన మూడు శాఖల్లో ఎలాంటి అవినీతి మరకలు లేకుండా పని చేశానని అన్నారు. "కాంగ్రెస్ పార్టీలో కొన్ని గుంటనక్కలు ఉన్నాయని, నిన్న మొన్న వచ్చిన వారు సైతం మాపై మాట్లాడుతున్నారు" అంటూ ధ్వజమెత్తారు. వరంగల్ సీనియర్ నేతలైన కడియం శ్రీహరి, బసవరాజు సారయ్య, నాయని రాజేందర్ రెడ్డిలపై విమర్శలు గుప్పించారు. వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లోనూ తమ అనుచరులకే కాంగ్రెస్ టికెట్లు ఇచ్చేది మేమేనని, తమ వారే గెలుస్తారంటూ వ్యాఖ్యానించారు.

అనంతరం కొండా మురళి మాట్లాడుతూ... "ఒక్కసారి 'సారీ' చెప్తే సురేఖ మంత్రి పదవి పోయేది కాదు. కానీ చెయ్యని తప్పుకు క్షమాపణలు ఎందుకు చెప్పాలి. పదవులు ఇవాళ వస్తాయి, రేపు పోతాయి.. కానీ మాట మీద నిలబడటమే మాకు ముఖ్యం." అని సురేఖ చెప్పిందని తెలిపారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఏఐసీసీ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ కొండా సురేఖకు ఫోన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ ఫోన్ కాల్ తర్వాతే కొండా దంపతులు తమ అనుచరులతో సమావేశమై కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని స్పష్టం చేయడంతో పాటు వ్యతిరేక వర్గంపై ఘాటు విమర్శలు చేశారని సమాచారం. అధిష్టానం భరోసాతోనే కొండా దంపతులు ఈ రకంగా మాట్లాడారా..? లేదా.? అనేది చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్‌లోనే ఉంటూ పార్టీలోని తమ వ్యతిరేక వర్గంపై సవాల్ విసరడం అధికార పార్టీకి కొత్త తలనొప్పులు తెచ్చిపెట్టేలా ఉంది. ఇప్పటికే ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న తరుణంలో కొండా దంపతుల టార్గెట్ ఎవరికి డామేజ్ చేయనుందనేది వేచి చూడాలి.

# భారత్ దౌత్యం భళా

**మొదటిపేజీ తరువాయి...**

ఇండోనేషియా బ్రిక్స్ కుటుంబంలోకి వచ్చాయి. అయితే ఈ పది కొండు దేశాలది వాణిజ్య, ఆర్థిక, భౌగోళిక, రాజకీయంగా ప్రత్యేకమైన పరిస్థితి. సభ్య దేశాల్లోని ఇరాన్, యూఏఈ, సౌదీలకు అస్సలు పడదు. ప్రస్తుతం ఇరాన్ తరచూ యూఏఈ, సౌదీలపై విరుచుకుపడుతోంది. క్షిపణులు, డ్రోన్లతో వరుస దాడులు చేస్తోంది. అదే సమయంలో సౌదీ, యూఏఈలోని తన ఎయిర్ బేస్‌ల నుంచే అమెరికా ఖర్గ్ ద్వీపం, ఇరాన్‌పై ఎటాక్స్ జరుపుతోంది.

ఇక అటు రష్యా కూడా ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా చాన్నాళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతోంది. చైనా, ఇండియా మధ్య సంబంధాలు ఏపాటిగా ఉన్నాయో పెద్దగా చెప్పాల్సిన పనిలేదు. అయితే ఇంతటి విభిన్నమైన రాజకీయ పరిస్థితులు, వైరుధ్యాలను కలిగి ఉన్న బ్రిక్స్ దేశాలు ఢిల్లీ వేదికగా పలు అంశాలపై ఏకాభిప్రాయానికి రావడమే చాలా గొప్ప విషయం. బ్రిక్స్ సభ్య దేశాలు కూటమి సమిష్టి నిర్ణయం, ఎజెండాకు జైకొట్టేలా భారత్ చేయగలగడం రియల్లీ గ్రేటే. బ్రిక్స్ సభ్య దేశాలు ఉమ్మడి ప్రకటనపై ఏకాభిప్రాయం సాధించడం భారత్‌కు అంత సులభమేమీ కాలేదు. సదస్సుకు ముందే ఆయా దేశాలతో పలు మార్లు వరుస సమావేశాలు నిర్వహించింది. బ్రిక్స్ సదస్సులో చేర్చించబోయే అంశాలు, తీసుకోవాల్సిన నిర్ణయాలు, అనుసరించాల్సిన వ్యూహాల గురించి సభ్య దేశాలకు వివరించింది. కూటమిలోని అన్ని దేశాలతో సంప్రదింపులు చేసి విభేదించే అంశాలపై సాధారణ అంగీకారానికి వచ్చే మార్గాన్ని భారత్ అన్వేషించింది. ముఖ్యంగా పశ్చిమాసియా అంశంపై సౌదీ, యూఏఈ, ఇరాన్‌ను ఒప్పించగలగడం గమనార్హం. ఆయా దేశాల ప్రతినిధులు శిఖరాగ్ర సదస్సుకు వచ్చిన తర్వాత కూడా బ్రిక్స్ డిక్లరేషన్‌ను వారి ముందు పెట్టి మొత్తం ముసాయిదాపై కూలంకషమైన చర్చకు పెట్టింది.

వివాదాస్పద అంశాలను దూరం పెట్టి అవసరమైన విషయాలనే డిక్లరేషన్‌లో చేర్చింది. అయితే ముసాయిదాలోని కొన్ని అంశాలపై యూఏఈ అభ్యంతరం తెలుపగా.. వాటి సవరణకు సభ్య దేశాలను ఒప్పించగలగింది. టెర్రరిజం, యుద్ధాలు, వ్యాపారం, వాణిజ్యం, పరస్పర సహకారం, బ్రిక్స్ న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ పనుల విస్తరణ, డీ డాలరైజేషన్, ఇతరత్రా వంటి విషయాలపై సభ్య దేశాలు ఏకాభిప్రాయానికి వచ్చేలా చేయడంలో ఇండియా సక్సెస్ అయ్యింది. తద్వారా ఢిల్లీ డిక్లరేషన్‌కు అన్ని సభ్య దేశాలు ఏకాభిప్రాయంతో ఆమోదం తెలిపేలా చేయడం విశేషం. 18వ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా భారత్ అనుసరించిన ఈ విదేశాంగ విధానం మధ్యవర్తిత్వ సంప్రదింపుల వ్యవహారాలు బ్రిక్స్ కూటమి సభ్య, ప్రపంచ దేశాలు సైతం మెచ్చుకోవడం విశేషం.



# ముక్క పెట్టాల్సింది

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** బ్రిక్స్ సదస్సులో పాల్గొన్న దేశాధినేతలకు ఇచ్చిన విందులో కేంద్ర ప్రభుత్వం నాన్‌వెజ్ ఎందుకు పెట్టలేదని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. మాంసాహార వంటకాలు చేయకపోవడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు సందర్భంగా రాహుల్ గాంధీ ఆదివారం ఈ కీలక కామెంట్స్ చేశారు. దేశంలో 80 శాతం మంది మాంసాహారులేనని, కానీ బ్రిక్స్ విందులో మాత్రం కేవలం శాఖాహార వంటకాలనే వడ్డించడం ఏంటని నిలదీశారు. భారతీయ మాంసాహార వంటకాలు ఎంతో రుచికరంగా ఉంటాయని, తన సోదరి తయారు చేసిన చోలే భటూరే కూడా రుచికరంగానే ఉంటాయని అంటూ భోజనానికి సంబంధించిన ఓ ఫొటోను సోషల్ మీడియాలో రాహుల్ షేర్ చేశారు. భారతదేశంలో ఆహారపు అలవాట్లలో ఉన్న వైవిధ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అంతర్జాతీయ అతిథులకు ఇచ్చే విందులో నాన్‌వెజ్ వంటకాలను కూడా చేర్చితే బాగుండేదన్నారు. అయితే రాహుల్ గాంధీ కామెంట్స్‌పై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. కాంగ్రెస్ బ్రిక్స్ దేశాధినేతలకు వడ్డించిన భోజనాన్ని కూడా రాజకీయ అంశంగా మారుస్తోందని విమర్శించారు. భారతీయ శాఖాహార వంటకాలను అతిథులు బాగానే ఆస్వాదించారన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల ఆహార సంప్రదాయాలు, రుచులు, పోషక విలువలు శాఖాహార వంటకాల్లో ప్రతిబింబించాయని తెలిపారు. అయితే బ్రిక్స్ నేతలు బస చేసిన ఢిల్లీలోని కొన్ని స్టార్ హోటళ్లలో మాత్రం అతిథుల ఆహారపు అలవాట్లను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం శాఖాహార, మాంసాహార వంటకాలను సిద్ధం చేయించడం విశేషం.